క్లుప్తంగా

ఘనంగా 'న్యూ ఎరా'లో గ్రాడ్యుయేషన్ డే

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని న్యూ ఎరా పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. పీపీ–1, పీపీ–2 తరగతులను విజయవంతంగా పూర్తి చేసుకున్న చిన్నారులు ప్రాథమిక తరగతుల్లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ వేణుగోపాలరెడ్డి తెలిపారు. అకడమిక్ ఇన్‌చార్జ్ అపర్ణ, ప్రైమరీ ఇన్‌చార్జ్ గౌతమిలతో కలిసి ఆయన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ సోమవారం ఈఈ సత్యనారాయణ, డీఈ శ్రీదేవి, ఏఈ రంజిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌లతో సమావేశమయ్యారు. మూసాపేట డివిజన్‌లో శంకుస్థాపనలు చేసి ఇప్పటి వరకు మొదలు కాని పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులు చేయటం చేతకాకపోతే ఉద్యోగాలకు రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉన్న పెండింగ్ పనులను రెండు, మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు త్వరగా పూర్తి చేయకపోతే అధికార యంత్రాంగంపై ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కార్పొరేషన్ రుణాలు అర్హులకు అందేలా చర్యలు

కుత్బుల్లాపూర్: మైనార్టీ కార్పొరేషన్ రుణాలను అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి అన్నారు. సోమవారం కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రూ.2 లక్షల యూనిట్‌కు ఒకటి, రూ.లక్ష యూనిట్లు రెండింటికి గాను 47 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 36 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్‌గౌడ్, బ్యాంక్ అధికారులు, మెప్మా సెక్షన్ టీఎంసీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయి'

దుండిగల్: రాష్ట్రంలోని ప్రతి ఇంటికి బీఆర్ఎస్ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని శాసన మండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ ఇందిరమ్మకాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, దుండిగల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి, వైస్‌చైర్మన్ పద్మారావు, డా. ఆనంద్, కమిషనర్ సత్యనారాయణ, డా. నిర్మల, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బెంబడి వనిత, సునీత యాదవ్, మాదాసు వెంకటేష్, అర్కల అనంతస్వామి, బౌరంపేట్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కబ్జాదారులకు అధికారులు సహకరించడం శోచనీయం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

రంగారెడ్డినగర్: అధికార పార్టీ నేతలు కబ్జాలకు పాల్పడుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ విమర్శించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ పరిధిలోని సర్వే నం.485, 486 రేణుకాఎల్లమ్మ కాలనీ లేఔట్‌లో పార్క్, షాపింగ్ కాంప్లెక్స్ స్థలంలో ఆక్రమణలపై జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డీఆర్‌ఓ లింగానాయక్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... ప్రజల ఆస్తులను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అధికార పార్టీ నేతలకు అధికారులు సహకరించడం శోచనీయమని అన్నారు. తక్షణమే రేణుకాఎల్లమ్మ కాలనీ పార్క్, షాపింగ్ కాంప్లెక్స్ స్థలంలో అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని కోరారు. లేకుంటే ప్రజలతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి యాదవ్, సీనియర్ నాయకులు శేషారెడ్డి, కాలనీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నరోత్తం రెడ్డి, నారాయణ రావ్, నరేంద్రకుమార్, వరప్రసాద్ తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ



జీఓ.58 ప్రకారం రెగ్యులరైజ్ చేసిన పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- జీఓ.58 పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఇళ్ల రెగ్యులరైజ్ అయిన 150 మందికి పట్టాల అందజేత

కూకట్‌పల్లి: ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న నిరుపేదల స్థలాలను జీఓ.58 కింద క్రమబద్ధీకరించి సోమవారం 150మందికి ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. ఈ కార్యక్రమం కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు జీఓ.58 ప్రకారం రెగ్యులరైజ్ చేసి భరోసా కల్పించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. ఎప్పుడు మానవీయకోణంలో ఆలోచించే వారికి మాత్రమే ఇటువంటి ఆలోచనలు వస్తాయని అందుకే రైతులకు అండగా రైతుబంధు, రైతుబీమా, నిరుపేదలకు ఆడబిడ్డల పెళ్లిలకు కల్యాణలక్ష్మి అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపే సంక్షేమ పథకాలతో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు.

◆ కేవలం సంక్షేమ పథకాలతోనే కాకుండా రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులను తీసుకువచ్చి అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడకుండా పటిష్టమైన భద్రత కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కేవలం 9 ఏళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సబిహా బేగం, పండాల సతీష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, ఎంఆర్‌ఓలు గోవర్ధన్, డి.అహల్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించి రోడ్డు వేయండి

◆ బాలాజీనగర్‌లో డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి రోడ్డు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, ప్రభాకర్‌గౌడ్, ఆరోగ్యరెడ్డి, అధికారుల ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, వాటర్ వర్క్స్ జీఎం ప్రభాకర్, ఏఈ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లోని డ్రైనేజీ సమస్యపై స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీ డివిజన్‌లో జిమ్ ప్రారంభం..

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని సబీసీ ఐడీ, ఎన్ఆర్ఎస్ఏ కాలనీల్లో ఓపెన్‌జిమ్‌ను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. అనంతరం ఎన్ఆర్ఎస్ఏ కాలనీలో వాటర్ పైప్‌లైన్ కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో ఎక్కడికక్కడ పార్కులను సుందరీకరించి ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. వీటిని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. పెండింగ్ ఇంకా మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో అక్కడక్కడ నీటి సమస్య తలెత్తుతోందన్నారు. దీనిని ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సాయిబాబా చౌదరి, శ్యామల రాజు, అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం

- ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ
- అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందేలా చర్యలు



టీయూడబ్ల్యూజే కూకట్‌పల్లి నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక సమావేశంలో పాల్గొన్న నాయకులు

కూకట్‌పల్లి: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) సంఘం పాత్రికేయుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని... అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ దేవాలయం ప్రాంగణంలో సోమవారం టీయూడబ్ల్యూజే కూకట్‌పల్లి నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అల్లం నారాయణతో పాటు టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జర్నలిస్టులకు స్థానిక ఎమ్మెల్యేలు ఇళ్ల స్థలాలు అందిస్తూ వస్తున్నారని చెప్పారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో పనిచేసే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. మారుతిసాగర్ మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి నుంచి, మండల స్థాయి వరకు పని చేస్తున్న ప్రతి ఒక్క జర్నలిస్టుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు ప్రభుత్వ పథకాలు అందేలా యూనియన్ కృషి చేస్తుందని చెప్పారు.

◆ ఈ సందర్భంగా కూకట్‌పల్లి కమిటీ నూతన అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి భాస్కర్ చారిలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు విద్యా వెంకట్, ఆర్కే దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్, మల్లేశం, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు, దరువు అంజన్న, పీవీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాంకీపెరల్ కాలనీ సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని రాంకీ పెరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1.5 కోట్లతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాంకీపెరల్ కాలనీలో సొంత నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేసుకోవటంలో ఆదర్శంగా నిలిచారన్నారు. ఇది అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. రాంకీ పెరల్ కాలనీవాసులకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రాంకీ పెరల్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో కాషాయ జెండా ఎగురవేస్తాం



బీజేపీలో చేరిన ఎల్లమ్మబండ యువకులతో రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాషాయ జెండాను ఎగురవేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ నుంచి సందీప్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రవీణ్, భరత్, సాయి, క్రాంతి, కౌశిక్ తదితరులు సోమవారం రవికుమార్ యాదవ్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. వారందరికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ 9 ఏళ్లుగా ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతూ.. మోసం చేస్తూ ఉందన్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, మోడ్రన్ స్కూల్స్, కేజీ టు పీజీ ఉచిత విద్య, దళితులకు 3 ఎకరాల భూమి, బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి నట్టేటా ముంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గతంలో పీజేఆర్, భిక్షపతియాదవ్‌లు మాత్రమే శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బాగా అభివృద్ధి చేశారని తెలిపారు.

◆ ప్రస్తుత ఎమ్మెల్యే గాంధీ నియోజకవర్గాన్ని అవినీతికి, భూకబ్జాలకు, అక్రమాలకు, వసూళ్లకు అడ్డాగా మార్చారన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనలో వైఫల్యం చెందారని తెలిపారు. ఆయన ప్రజాసమస్యలను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ప్రజలు ఏ సమయంలో ఏ కష్టం వచ్చి తాను అండగా ఉంటానని రవికుమార్ యాదవ్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, డివిజన్ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ రవీందర్‌రావు, కుమార్ యదవ్, నర్సింగ్‌యాదవ్, నరసింహాచారి, ఆంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

మమత ఆస్పత్రి వైద్యుల ఘనత

నిజాంపేట్: క్యాండిలా ట్రాపికాలిస్ అనే ఫంగస్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న బాలికకు బాచుపల్లిలోని మమత ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా చికిత్స చేశారు. సనా (13) అనే బాలిక దగ్గు, ఆయాసంతో మమత ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చింది. బాలికకు నిమోనియా వచ్చిందని నిర్ధారించిన వైద్యులు రెండు రోజుల పాటు యాంటీబయాటిక్స్ ఇవ్వడంతో పాటు వెంటిలేటర్‌పై ఉంచినా పరిస్థితి మెరుగు పడలేదు. దీంతో బ్రాంకోస్కోపీ చేయగా క్యాండిలా ట్రోపికాలిస్ ఫంగస్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. బాలికకు పల్మానాలజిస్ట్ పర్యవేక్షణలో యాంటీ ఫంగల్, టైకో ప్లానిస్ వంటి యాంటీబయోటిక్‌లు ఇవ్వడంతో వారం రోజుల్లో సాధారణ స్థితికి చేరిందన్నారు. ఊపిరితిత్తులకు చాలా అరుదుగా సోకే ఇన్‌ఫెక్షన్‌ను తమ వైద్యులు విజయవంతంగా నయం చేయగలిగారని ఆస్పత్రి ఎండీ డా. నయన్ రాజ్ తెలిపారు.

జీఓ 59 లబ్ధిదారులు సకాలంలో పన్నులు చెల్లించాలి

కలెక్టర్ అమయ్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ అమయ్‌కుమార్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో జీఓ 59 కింద నోటీసులు అందుకున్న వారంతా సకాలంలో పన్నులు చెల్లించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని వీఆర్‌ఓ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలకు జీఓ 59పై ఆయన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీఓ 59పై ఉన్న అపోహలు వీడాలని, ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రజలకు జీఓ 59పై ఆటోల ద్వారా విస్తృత ప్రచారం చేసి ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. ఇప్పటికే 240 మంది జీఓ 59 కింద డిమాండ్ నోటీసులు కట్టారని, మరికొందరు మొదటి విడతలో చెల్లించాలని తెలిపారు. వెంటనే అర్హులైన వారంతా డీడీలు కట్టాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, తహసీల్దార్ అనిత, మున్సిపల్ కమిషనర్ రామలింగం, ఆర్ఐ విశ్వనాథ్, కార్పొరేటర్లు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట కమ్యూనిటీహాలులో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా కంటి వెలుగుకు శ్రీకారం చుట్టారన్నారు. మోతీనగర్ పరిసర ప్రాంత ప్రజలు ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగుల సత్యం, తిరుపతి, అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రుద్రగౌడ్, అబ్బులు, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ నాయుడు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



అధికారులతో కలిసి హైదర్‌నగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కృష్ణవేణి కాలనీ, శ్రీరామ్‌నగర్, సాయి ప్రశాంత్‌నగర్ ఫేజ్ 1, 2 కాలనీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల పరిశీలనకు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు సోమవారం ఇంజినీరింగ్, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిశీలించేందుకు అధికారులతో కలిసి వచ్చానని కార్పొరేటర్ తెలిపారు. హైదర్‌నగర్ డివిజన్‌లో మెరుగైన రవాణా సౌకర్యానికి శాయశక్తుల కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రశాంతి, సూపర్‌వైజర్ నరేంద్ర, వాటర్ లైన్‌మెన్ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎలక్ట్రికల్ లైన్‌మెన్ శ్రీనివాస్, వీధిలైట్ల లైన్‌మెన్ సుధాకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వెస్టన్ హిల్స్ అడ్డగుట్ట సొసైటీ కాలనీలో...

వెస్టన్ హిల్స్ అడ్డగుట్ట సొసైటీ కాలనీలో డ్రైనేజీ నిత్యం పొంగుతోంది. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. డ్రైనేజీ లీకేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

'గడప గడపకు బీజేపీ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

భాగ్యనగర్‌కాలనీ: రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ ఈనెల 31న తలపెట్టనున్న గడప గడపకు బీజేపీ వాల్‌పోస్టర్ పోస్టర్‌ను సోమవారం ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... ఈ కార్యక్రమంతో తమ పార్టీ నియోజకవర్గంలో మరింత బలోపేతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ గడప గడపకు బీజేపీలో పాల్గొని ఈ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. పాదయాత్ర షెడ్యూల్, విధి విధానాలను అతి త్వరలో విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు రామరాజు, కో–కన్వీనర్ మణిభూషణ్, రాష్ట్ర బీజేవైఎం జనరల్ సెక్రటరీ అరుణ్‌కుమార్, నాయకులు నరేందర్‌రెడ్డి, బీజేవైఎం నేషనల్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్, అధికార ప్రతినిధి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవికుమార్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి

ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాల్సిందే...



ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్‌కు సంబంధించిన వివరాలు తెలుపుతున్న జెడ్‌సీ మమత

- వ్యాపారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి
- ఎలాంటి యూజర్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు
- అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం
- కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి. మమత

కూకట్‌పల్లి: నగరంలో అగ్ని ప్రమాదాల నివారణకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని.. 100 స్క్వేర్ మీటర్ల విస్తీర్ణం ఉన్న భవనాలు తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి. మమత పేర్కొన్నారు. సోమవారం ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిన్నచిన్న షాపులు, వ్యాపారం చేసుకునే ఇంటి యజమానులు, అద్దెకు తీసుకొని 100 స్క్వేర్ మీటర్ల కంటే తక్కువ గాని అంతకంటే ఎక్కువ ప్లింత్ ఏరియాలో వ్యాపారం చేసుకునే వారు అగ్ని ప్రమాదాల నివారణకు ఎవరికి వారే ఫైర్ మిటిగేషన్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎంసీకి ఎలాంటి యూజర్ చార్జీలు చెల్లించకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో జారీ అవుతుందన్నారు. ప్రతి వ్యాపారస్తుడు ఈ సర్టిఫికెట్ పొందడానికి ముందుకు రావాలని కోరారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం

◆ ముందు www.ghmc.gov.in వెబ్‌సైట్‌ను క్లిక్ చేసి ఫైర్ మిటిగేషన్, సేఫ్టీ సర్టిఫికెట్ సెలక్ట్ చేయాలన్నారు.

◆ తరువాత https://firesafety.ghmc.gov.in ఈ లింక్ ద్వారా అప్లై చేసుకోవచ్చన్నారు.

◆ మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేసిన వెంటనే ఓటీపీ వస్తుందని దానితో నమోదు చేయాలన్నారు. మంటలను ఆర్పే పరికరాల ఏజెన్సీ జాబితా నుంచి తమకు నచ్చిన ఏజెన్సీని సెలక్ట్ చేసుకోవాలని పేర్కొన్నారు.

◆ అర్జీదారుడు ఇంటి ట్యాక్స్ ఇండెక్స్ నంబర్ టిన్ నంబర్‌తో పాటు ఎంపానెల్ ఏజెన్సీని ఎంపికకు కన్‌ఫర్మ్ చేసుకోవాలన్నారు.

◆ ఒకవేళ టిన్ నంబర్ లేని పక్షంలో షాపు ఎస్టాబ్లిష్‌మెంట్, చిరునామా, సర్కిల్ లేదా జోన్‌ను ఎంపిక చేసుకున్న తరువాత ఎంపానల్ ఏజెన్సీని సెలక్ట్ చేసుకుని కన్‌ఫర్మ్ చేసుకోవాలని తెలిపారు.

◆ తమ షాపు వద్దకు వచ్చి ఫైర్‌సేఫ్టీ పరికరాలను ఫిటింగ్ చేస్తారు. ఆ తర్వాత ఆ ఏజెన్సీ ఫిటింగ్ చేసినట్లు వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారని తెలిపారు.

◆ ఫైర్ మిటిగేషన్, సేఫ్టీ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో జనరేట్ అవుతుందని తమ అప్లికేషన్ స్టేటస్ రిపోర్టులో చూసుకోవచ్చన్నారు.

◆ జనరేట్ అయిన సేఫ్టీ సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని షాపులో డిస్‌ప్లే చేసుకోవాలని సూచించారు.